



గౌరీవీధి సచివాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో లబ్ధిదారుల సందడి

చెప్పింది మరువకుండా చేసే నేతగా ప్రజల మన్ననలు అందుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమకు లక్షల ఆస్తి పుట్టింటి కానుకలా అందజేశాడని 33వ వార్డు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 33వ వార్డులోని 1150 మంది సొంతింటి కల నిజం చేస్తూ జగనన్న వారికి ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా వాటిని రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందజేస్తున్నారు. దీంతో జగన్‌బాబు తోడబుట్టిన వాడిలా, కడుపున పుట్టిన కొడుకులా ఆదుకున్నాడని మహిళలు సీఎం జగన్‌కు ధన్యవాదాలు చెబుతున్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా..

- 33వ వార్డులో 1150 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- జగనన్నకు రుణపడి ఉంటామంటున్న మహిళలు



రిజిస్ట్రేషన్ పట్టాలందుకున్న లబ్ధిదారులు

అల్లిపురం : ఎక్కడ చూసినా ఇళ్ల పట్టాల పండగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంత గూడు నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో వైఎస్సార్ ఆవాస్ యోజన, వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం, పేదలకు ఇళ్ల పట్టాలు పేరిట ఇళ్ల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించింది. లక్షలాది ఎకరాల్లో జగనన్న కాలనీలు నిర్మించి పట్టాలు అందజేస్తున్నారు. వాటికి లబ్ధిదారులతో జియో ట్యాగింగ్ పూర్తి చేశారు. తాజాగా వాటిని సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు కూడా చేయిస్తున్నారు. దీంతో సచివాలయాల్లో ఎక్కడ చూసినా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల కార్యక్రమం జోరుగా జరుగుతోంది. రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారు తమకు జగనన్న లక్షల ఆస్తి అందజేశాడని, తమకు సొంత ఇళ్లు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తమ సొంతింటి కల కలగానే మిగిలిపోతుందేమోనని భయపడ్డామని.. కానీ జగనన్న తమ కలను నిజం చేశాడంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు తమ పేరిట సొంత ఇళ్లు సమకూరినందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆడపడుచులకు సీఎం జగన్ ఒక అన్నగా పసుపు, కుంకుమలు అందించాడని, తమ అన్నదమ్ముడు తమకు ఇచ్చిన ఆస్తిగా భావిస్తున్నామని చెబుతున్నారు.

33వ వార్డులో 1150 మందికి..

అనకాపల్లి జిల్లా, గంగవరం లే అవుట్‌లో 33వ వార్డుకు చెందిన మొత్తం 1150 మందికి స్థలాలు కేటాయించారు. గత ఐదు రోజులుగా రిజిస్ట్రేషన్ల కార్యక్రమం మహారాణిపేట ఎంఆర్‌వో రమణయ్య, జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 252 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొన్ని రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది వస్తుందన్నారు. వాటిని సవరించి పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

పుట్టింటి ఆస్తిగా భావిస్తా..



జగనన్న సహకారంతో మా సొంతింటి కల నెరవేరింది. పుట్టింటి ఆస్తిగా దీనిని భావిస్తున్నాను. జగనన్న ఒక అన్నదమ్ముడిలా నాకు కన్నవారి ఆస్తి ఇచ్చినట్లు ఇచ్చాడు. దీనిని కలకాలం నిలుపుకుంటాను. పేదల సేవకే జగనన్న ఉన్నాడనిపిస్తుంది. ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

– నున్న కళ్యాణి, అల్లిపురం

అన్నలా ఆదుకున్నాడు..



జగనన్న నా లాంటి వాళ్లను అన్నలా ఆదుకుంటున్నాడు. అతని రుణం తీర్చుకోలేనిది. ఆడపడుచులకు అండగా నిలిచిన అన్నను మరల గెలిపించుకుంటాం. ఆ బాధ్యత మాపై ఉంది. మాకు ఆపదలో అండగా నిలిచిన జగనన్నను మరిచేది లేదు. ఆయన గెలిస్తేనే పేదలకు మేలు జరుగుతుంది.

– ఆరిపాక దేవి, అల్లిపురం

మళ్లీ జగనే సీఎం..



జగనన్న తోడబుట్టిన వాడిలా ఆడపడుచులకు అండగా నిలిచాడు. అలాంటి అన్నకు వందనం. నవరత్నాలతో అండగా నిలిచిన ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. మరల సీఎంగా అతన్నే గెలిపించుకుంటాం. అప్పుడే అందరికీ న్యాయం జరుగుతుంది.

– ముళ్లు పద్మ, అల్లిపురం

జగన్‌బాబు వెయ్యేళ్లు వర్ధిల్లాలి..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొడుకులా ఆదుకున్నాడు. చిన్నవారికి అన్నలా, పెద్ద వారికి తమ్ముడిలా, వృద్ధులకు కొడుకులా పింఛన్లు, ఆసరా వంటివి ఇస్తూ చేదోడుగా ఉన్నాడు. నా కొడుకు జగన్‌కు నా ఆశీస్సులు. ఆయన వెయ్యేళ్లు వర్ధిల్లాలని దీవిస్తున్నాను.

– నేతాడ పార్వతి, అల్లిపురం

చురుగ్గా.. రిజిస్ట్రేషన్లు



వైఎస్సార్ ఆవాస్ యోజన కింద లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమం 33వ వార్డులో చురుగ్గా కొనసాగుతోంది. చిన్నచిన్న సమస్యలు ఉన్నా వాటిని అధిగమించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగిస్తున్నాం. ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు ఈ కార్యక్రమం జరుగుతోంది.

– సన్యాసినాయుడు, జోన్–4, జోనల్ కమిషనర్

క్లుప్తంగా

సుపరిపాలనే లక్ష్యంగా బరిలోకి..



పార్టీ బ్యానర్ ఆవిష్కరిస్తున్న సంధ్య తదితరులు

దాబాగార్డెన్స్ : ప్రజా సమస్యలు పరిష్కరించి మంచి పాలన అందివ్వడమే లక్ష్యంగా ఆల్ తెలుగు ప్రజా పార్టీ అవతరించిందని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు ఎం. సంధ్య తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేయడం, అవినీతిరహిత పాలనే ధ్యేయంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తమ పార్టీ పని చేస్తుందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు అన్ని పార్టీలు అవినీతిని ప్రోత్సహిస్తూ, సంక్షేమాన్ని గాలికొదిలేసాయని ఆరోపించారు. జీరో మనీ పాలిటిక్స్ నినాదంతో ప్రజల్లోకి వెళ్లి మంచి ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజోపయోగకరమైన మేనిఫెస్టోతో తమతో కలిసి వచ్చే పార్టీలను కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు.

బీజేపీ కార్యకర్తకు పరామర్శ



సుబ్బారావును పరామర్శిస్తున్న రూపాకుల రవికుమార్

మహారాణిపేట : కేజీహెచ్ సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న యు.సుబ్బారావును శనివారం బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్ పరామర్శించారు. సుబ్బారావు అధిక మధుమేహం వల్ల కేజీహెచ్‌లో చేరారు. కాలికి శస్త్ర చికిత్స అనంతరం మోకాలి కింద భాగం వరకు వైద్యులు తొలగించారు. శస్త్ర చికిత్స పూర్తి కావడంతో రవికుమార్ వెళ్లి పరామర్శించారు. సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిపై రవికుమార్ వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆల్బర్ట్, కొప్పల రామ్ కుమార్, చితకల రాజబాబు, చొక్కాకుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

- రూ. 2.60 లక్షలు స్వాధీనం

అల్లిపురం : నగరంలోని ఒక స్టార్ హోటల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు, మహారాణిపేట పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.60 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఒక హోటల్లో పేకాట ఆటుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి నగదు స్వా. దీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఐద్వా సమావేశాల విజయవంతానికి పిలుపు

ఆరిలోవ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 22 నుంచి 25 వరకు జరగనున్న ఐద్వా సభలకు డ్వాక్రా మహిళలు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. ఐద్వా ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో శనివారం ఆరిలోవ సీఐటీయూ కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభావతి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వం ప్రతి సభలకు డ్వాక్రా మహిళలను వినియోగించుకుంటుందని ఆరోపించారు. నగరంలో జరగనున్న ఐద్వా సభలకు మహిళలంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ప్రియాంక, ఆరిలోవ సంఘం మహిళలు ఎస్. రంగమ్మ, రమణమ్మ, లక్ష్మి, అమ్మాజీ, శాంతి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

దాబాగార్డెన్స్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులు అత్యధికంగా ఉన్న విశాఖ దక్షిణ నియోజకవర్గాన్ని అన్ని రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణులకే కేటాయించాలని విశ్వబ్రాహ్మణ మహాసేన డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకుడు, విశ్వబ్రాహ్మణ సంఘాల నుంచి విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తాళ్లబత్తుల అప్పలాచారి మాట్లాడారు. రాష్ట్రంలో 24 లక్షల మంది విశ్వబ్రాహ్మణులు ఉన్నారని, ఏ ఒక్క పార్టీ కూడా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా న్యాయం చేయడం లేదన్నారు. సరైన గుర్తింపు లేని కారణంగా విశ్వబ్రాహ్మణులు కులవృత్తులను విడిచి కూలి పనులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణుల ఎదుగుదలకు ప్రధాన పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి తాను సిద్ధమని, విశ్వబ్రాహ్మణ సంఘాలంతా ఐక్యంగా ఉన్నాయని చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శివకోటి వాసు మాట్లాడుతూ నగరంలో 25 వేలు, గాజువాకలో 10 వేలు, జిల్లావ్యాప్తంగా లక్ష మంది జనాభా కలిగి ఉన్నామని చెప్పారు. సంఘం ప్రతినిధి గోడి నరసింహాచారి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులకు విశాఖ దక్షిణ నియోజకవర్గాన్ని కేటాయించాలని, గత తెలుగుదేశం ప్రభుత్వం ఇస్తానని చెప్పి మాట తప్పిందన్నారు. కనీసం ఎమ్మెల్సీ అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాశీ సన్యాసిరాజు, కె. సూర్య, ఎ. శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బోదిల పాటి ఉమా మహేశ్వరరావు, తాళ్లబత్తుల శ్రీనివాస్, జి. రవి, ఎం. ప్రసాద్, సూర్యసాయి, కె. మహేష్, నాగేశ్వరరావు, పి. ప్రసాద్, సూర్యనారాయణ, కొండబాబు, బి. సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్‌జీవో హోమ్ వద్ద సంఘీభావం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

మహారాణిపేట : ఏపీ ఎన్‌జీవోలు శనివారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఎన్‌జీవో హోమ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఉద్యోగులు పాల్గొన్నారు. వివిధ సమస్యల సాధన కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగులు నల్లబాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న ఉద్యోగులను ఉద్దేశించి జేఏసీ జిల్లా చైర్మన్, ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ప్రజల్లో భాగస్వాములైన ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్ రొంగలి రవిశంకర్, వివిధ సంఘాల నాయకులు కె.శ్రీనివాస్(ఏపీటీఎఫ్), డి.డి.ప్రసాదరావు (పెన్షనర్ల సంఘం), దాసరి నాగేశ్వరరావు(యూటీఎఫ్), దశరథరామిరెడ్డి (డీటీఎఫ్), ఎస్.సత్తిబాబు(పీఆర్ సంఘం), పి.అప్పలరాజు (ఇరిగేషన్ ఉద్యోగులు), జ్యోతి (ఐసీడీఎస్ ఎంప్లాయిస్), వీవీవీ రమణమ్మ (డిప్లొమా ఇంజినీర్లు), ఎస్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై త్వరలో సహస్ర దీపాలంకరణ సేవ

- రూ. 10 లక్షలతో కేంద్రం ఏర్పాటు
- భూమి పూజ నిర్వహించిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు



భూమి పూజ నిర్వహిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు

సింహాచలం : సింహగిరిపై త్వరలో సహస్ర దీపాలంకరణ సేవను పునరుద్ధరించనున్నారు. ప్రత్యేకంగా రూ.10 లక్షలతో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శనివారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు, అధికారులు భూమి పూజ నిర్వహించారు. అలాగే స్వామివారి తిరువీధి వాహనాలు ఉంచేందుకు మరో రూ.10లక్షలతో వాహనశాల ఏర్పాటు పనులకు కూడా భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్ట్‌బోర్డు సభ్యులు మాట్లాడుతూ సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులతో పాటు, స్వామి సేవలకు సంబంధించిన పనులకు చేపట్టనున్నామన్నారు. గతంలో ప్రతీ శనివారం సాయంత్రం ఆలయ ఆస్థానమండపంలో సహస్ర దీపాలంకరణ సేవ ఉండేదని గుర్తుచేశారు. ఆసేవను మరింత వైభవంగా నిర్వహించేందుగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. త్వరలోనే రూ.54 కోట్లతో ప్రసాద్‌స్కీమ్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మించిన కల్యాణమండపాలను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, సువ్వాడ శ్రీదేవి, దేవస్థానవం ప్రధాన పురోహితులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో నరసింగరావు, పీఆర్‌వో నాయుడు పేర్కొన్నారు.

సందేశాత్మక చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'

హీరో దీపక్ సరోజ్



మీడియాతో మాట్లాడుతున్న హీరో దీపక్ సరోజ్, హీరోయిన్లు తన్వి, కీర్తన

అల్లిపురం: యదార్థ సంఘటన ఆధారంగా యువతకు సందేశాత్మక చిత్రంగా సిద్దార్థ్ రాయ్ నిర్మించినట్టు ఆ చిత్ర హీరో దీపక్ సరోజ్ అన్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో బెస్ట్‌గా నిలుస్తుందన్నారు. ఈ నెల 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుందన్నారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు నగరంలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యశస్వి దర్శకత్వంలో బెంగాల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కించినట్లు తెలిపారు. ఎటువంటి ఎమోషన్స్ లేకుండా తిండి, నిద్ర, రొమాన్స్ మాత్రమే కావాలనుకునే యువకుడు ప్రేమకు ఎలా లొంగిపోయాడు అనేది సిద్ధార్థ్‌రాయ్ చిత్ర కథన్నారు. హీరోయిన్ తన్వి మాట్లాడుతూ ఈ చిత్రంలో ఇందు క్యారెక్టరు చేశానని, ఎంతో ధైర్యవంతురాలైన యువతిగా కనిపిస్తానన్నారు. మరో నటి కీర్తన కూడా మాట్లాడారు. తనకు మంచి పేరొస్తుందన్నారు.

ప్రభుత్వ మహిళా వసతి గృహాలకు రోటరీ క్లబ్ వితరణ

రూ.2.6 లక్షల బెడ్స్, సూయింగ్ మెషీన్స్ అందజేత



సీలింగ్ ఫ్యాన్లు అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

అల్లిపురం : మహిళా సాధికారతే లక్ష్యంగా రోటరీ డిస్ట్రిక్ట్ 3020 ద్వారా ఇచ్ఛాపురం నుంచి అమరావతి వరకు గల ప్రభుత్వ వసతి గృహాలు, ట్రైనింగ్ సెంటర్లు, పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు శనివారం హోటల్ దసపల్లాలో జరిగిన కార్యక్రమంలో రూ.2.6 లక్షల విలువ గల మెటీరియల్‌ను రోటరీ క్లబ్ పోర్టు సిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ గరల్స్ హాస్టల్‌కు 100 బెడ్స్, పది సీలింగ్ ఫ్యాన్స్, ఓల్డ్ డైరీఫామ్ గవర్నమెంట్ జువైనల్ వెల్ఫేర్ హోమ్‌కు 40 బెడ్స్, ఆరిలోవ మహిళా ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌కు సూయింగ్ మిషన్లు, జిగ్ జాగ్ సూయింగ్ మిషన్, సాగర్‌నగర్, ప్రభుత్వ అంధ బాలికల హాస్టల్‌లోని 18 మంది బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డీవీ వర్మ, అధ్యక్షుడు జి.విశ్వనాథ్, మాజీ అధ్యక్షుడు జీఎఫ్ రాజు, కార్యదర్శి ఎస్ఎన్ రాజు, కోశాధికారి కేవీ రమణ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

సింహాద్రిలో ఎంవోసీ నాగరాజు



యాష్ పాండ్‌ను సందర్శించిన అడిషినల్ సెక్రటరీ నాగరాజు, అధికారులు

పరవాడ : పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీని భారత ప్రభుత్వ అడిషినల్ సెక్రటరీ (ఎంవోసీ) నాగరాజు శనివారం సందర్శించారు. సముద్రిక అతిథి గృహం నాగరాజుకు వద్ద సంస్థ ఓ అండ్ఎం జీఎం డీపీ పాత్ర, టెక్నికల్ సర్వీసెస్ జీఎం పద్మప్రియ స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా తొలుతగా సంస్థకు చెందిన మోడల్ ప్లాంటు, మెయిన్ ప్లాంటు కంట్రోల్ రూం, యాష్ డేక్ ఏరియా, వ్యాగన్ టింప్లర్ ఏరియా, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు, సీవాటర్ పంప్ హౌస్‌లను సందర్శించారు. ప్లాంటు పనితీరును అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన ఆపరేషన్ జీఎం టి.రాజగోపాలన్, ఫైనాన్స్ జీఎం కె.జె.రావు, హెచ్ఆర్ హెడ్ బి.బి.పాత్ర పాల్గొన్నారు.

గర్భకోశ క్యాన్సర్ పట్ల అప్రమత్తం



బాలికలకు వ్యాక్సినేషన్ చేస్తున్న డాక్టర్ షిరీన్ రెహ్మాన్

మహారాణిపేట : లైంగిక సంబంధాలు, ధూమపానం వంటి కారణాలతో సంక్రమించే గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ బారి నుంచి బయటపడేందుకు సెర్విక్ క్వాడ్రి వ్యాలెంట్ వ్యాక్సిన్ 9 నుంచి 14 ఏళ్ల ఆడ పిల్లలకు ఉచితంగా వేసే కార్యక్రమానికి చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ శ్రీకారం చుట్టింది. ఏవీఎన్ కాలేజీ ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్లో శనివారం ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. తొలి విడతగా 50 మంది ఆడ పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేశారు. ఒక్కో డోస్‌కు రెండు వేల రూపాయలు వ్యయం అవుతుండగా అందుకయ్యే లక్ష రూపాయల ఖర్చును చైతన్య స్రవంతి భరిస్తోంది. ఆరు నెలల తర్వాత రెండో డోస్ వ్యాక్సిన్ వేస్తారు. పలు కారణాల వల్ల గర్భకోశ ముఖ ద్వార క్యాన్సర్ సోకుతుందని ఈ విషయమై ఆడపిల్లలు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కేజీహెచ్ రేడియాలజీ, అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి చెప్పారు.

ఈ కాన్సర్ నివారణకు చైతన్య స్రవంతి ముందుకొచ్చి ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం ముదావహమన్నారు. 9 నుంచి 14 ఏళ్ల వయసు గల వారికి రెండు సార్లు వ్యాక్సిన్ వేయాలని, ఆ తర్వాత 14 నుంచి 26 ఏళ్ల వయస్సు గల వారికి మూడుసార్లు వ్యాక్సిన్ వేయాల్సి ఉంటుందని తెలిపారు. తరచూ వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారానే క్యాన్సర్‌ను గుర్తించగలమని తెలియజేశారు. శరీరక మార్పులు గుర్తించిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఇదివరలో సర్వైకల్ క్యాన్సర్ ఎక్కువగా ఉండేదని, ఇప్పుడు బ్రెస్ట్ క్యాన్సర్ అధికంగా ఉందని, ఈ వ్యాధి నియంత్రణకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రెహమాన్ మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో క్వాడ్రి వాలంట్ వ్యాక్సిన్ ఉచితంగా వేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు ఈ వ్యాధి సోకితే ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని అన్నారు. ఈ వ్యాక్సిన్ కనీసం 80 శాతం మందికి రక్షణ కల్గిస్తుందని పేర్కొన్నారు. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ ఎక్కువగా ఉందని చెప్పారు. 9 నుంచి 14 ఏళ్ల పిల్లలకు రెండు డోసుల వ్యాక్సిన్, ఆ తర్వాత 26 లోపు ఆడవాళ్లకు మూడు డోసుల వ్యాక్సిన్ వేయాలన్నారు. వివాహం అయిన వారు కూడా వ్యాక్సిన్ వేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాక్సిన్ సరఫరా చేసే సంస్థ ఏరియా మేనేజర్ రాంప్రసాద్, చెతన్య స్రవంతి ప్రతినిధులు రకియాభాను, విజయ తదితరులు పాల్గొన్నారు

నేడు ఎరుకుమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి సన్నిధిలో చైర్మన్, ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి. రమాబాయి తెలిపారు. ప్రస్తుతం ఉన్న అమ్మవారి విగ్రహం వెనుక భాగాన ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి శనివారం గణపతిపూజ, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఊరేగింపు అనంతరం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఈ కార్యక్రమం నేత్రపర్వంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పిల్లి స్వాతి, పి.లక్ష్మీనారాయణమ్మ, పిల్లి దుర్గ, దళాయి అన్నపూర్ణ, పెద్దాడ రమణమ్మ, బంటుపల్లి సూర్యనారాయణ, కె.బ్రహ్మజీ, శరగడం నర్సింగరావు, ప్రధాన అర్చకులు గంగవరపు శ్రీనివాసరావు, సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

20న భీష్మ ఏకాదశి..

శ్రీఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 20న భీష్మ ఏకాదశి పర్వదినం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి. రమాబాయి తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు భీష్మ ఏకాదశి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా హరిహర నామ సంకీర్తన ఏకాహ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం ఉదయం 6 గంటల పాటు (24 గంటల) భక్తి గీతాలాపన కార్యక్రమం జరుగతుందని అన్నారు.

రేపు ఆస్ట్రేలియాలో విద్యపై అవగాహన సదస్సు

బీచ్‌రోడ్డు : ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డే సందర్భంగా ఆ దేశంలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి అవగాహన కల్పించేందుకు సోమవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎక్స్‌పర్ట్స్ సంస్థ మేనేజర్ అనిత కొమ్మరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఒక హోటల్లో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో టాప్ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందే విధంగా, వీసా సర్వీస్, స్కాలర్‌షిప్స్ ఎలా పొందాలి అనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7785968968 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణకు ఆహ్వానం



విజయ్ భావరాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులు చేపట్టాలని అమెరికాకు చెందిన ఈటాస్ రీసెర్చ్ ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపాల్ ఇంజినీర్ డాక్టర్ విజయ్ భావరాజుని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి స్వాగతించారు. శనివారం ఏయూను సందర్శించిన డాక్టర్ విజయ్‌తో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి కార్యాలయంలో భేటీ అయ్యారు. క్రిటికల్ టెక్నాలజీస్, ఏయూ నిర్వహిస్తున్న పలు స్టార్టప్‌లకు తాను మార్గదర్శకం వహిస్తానని డాక్టర్ విజయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి చాలెంజెస్ ఇన్ మోడరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ ద ఎమర్జింగ్ క్లైమేట్ ఇష్యూస్ అనే అంశంపై ప్రసంగించారు. విభాగ ఆచార్యులు పరిశోధన రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.